క్లుప్తంగా

గ్రామాల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి ముత్యాలనాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చినబాబు

పెదపూడి: ఏపీ సర్పంచుల ఐక్యవేదిక ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామాల అభివృద్ధికి సంబంధించి 15 అంశాలతో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు వినతి పత్రం అందించానని అనపర్తి నియోజకవర్గ సర్పంచుల ఐక్యవేదిక ప్రతినిధి రామేశ్వరం గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి చెప్పారన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ సర్పంచుల ఐక్య వేదిక సదస్సుకు నియోజకవర్గం తరఫున తాను హాజరయ్యానన్నారు. మంత్రి ముత్యాలనాయుడిని కలిసి పుష్పగుచ్ఛం అందించానన్నారు.

తంటికొండ దేవస్థానానికి బియ్యం, కూరగాయల వితరణ

గోకవరం/సీతానగరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి సనాతన హిందూ ధర్మ ప్రచార రథయాత్ర ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలను అందించారు. ప్రచార సేవా సమితి ప్రెసిడెంట్ కరుటూరి శ్రీనివాస్‌రావు, సెక్రటరీ వాకపల్లి సూరిబాబు భక్తుల సహకారంతో ప్రతీ శనివారం నిర్వహించే అన్నదానానికి టన్ను బియ్యం, 150 కేజీల కూరగాయలను ప్రచార రథంపై ఆలయానికి తీసుకువచ్చి అందజేశారు.

ఘనంగా సదస్యం

రంగంపేట: వడిశలేరు గ్రామంలో కొలువైయున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సదస్యం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు కోరుకొండకు చెందిన నున్న శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకుడు చిలకమర్రి కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, ఈవో ముమ్మన రాంబాబురెడ్డి ప్రసాదాలు పంపిణీ చేశారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

గోకవరం: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తారని మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. గోకవరంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ ఈ నెల 14న గోకవరం ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో రోడ్డు షో నిర్వహిస్తారన్నారు. 15న పెద్దాపురం నియోజకవర్గం, 16న అనపర్తి నియోజకవర్గంలో పర్యటిస్తారని వివరించారు.

అనపర్తి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 16న అనపర్తిలో పర్యటించనున్నట్లు చినరాజప్ప తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద చంద్రబాబు నిర్వహించే బహిరంగ సభ ప్రదేశాన్ని ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు.

శివరాత్రికి రాట మంచి

బిక్కవోలు: మండలంలోని కేదారేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి పనులు ప్రారంభించడానికి రాటమంచి కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలోని అర్చకులు సురేష్, పర్యవేక్షణలో జంగా గంగాధర్‌రెడ్డి, శ్రీ విద్యా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాట మంచి చేశారు. ఈ నెల 18వ తేదీన శివరాత్రి ఘనం నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.

ధ్యానంతో ప్రశాంతత

రంగంపేట: ధ్యాన సాధనతోనే మానసిక ప్రశాంతత పొందగలమని అందుకు అందరూ సాధన చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్ స్వర్ణక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన రంగంపేటలో గల శ్రీదుర్గమాంబ పిరమిడ్ సొసైటీ ఏడవ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిరమిడ్ అధ్యక్షురాలు ఉండవిల్లి భ్రమరాంబిక, సభ్యులు పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు: ఈ నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ప్రజల సమస్యలను గుర్తించి, ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తులు సీహెచ్ రాజగోపాల్, ఎం.నాగేశ్వరరావు, డి.విజయ్‌గౌతమ్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల డీఎస్పీలు, సీఐలు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మెట్టలో పొద్దు పొడుపు

- విత్తన కేంద్రంగా కోరుకొండ మండలం
- రబీ పంటకు సాగునీరందడంతో రైతన్నల మొగ్గు
- కంపెనీలకు విత్తనాలందించే ఒప్పందం



కోటిలో చివరి దశకు చేరిన పంట

మధురపూడి: మామిడి, జీడిమామిడి తోటలకు నిలయమైన మెట్ట ప్రాంతంలో నీటి వసతి పెరగడంతో రైతన్నలు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ, సీతానగరం మండలాల్లో పొద్దు తిరుగుడు సాగు జోరందుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరగడంతో ఖరీఫ్‌తో పాటు, రబీ సీజన్‌లో భూములు సాగుకు నోచుకున్నాయి. దానిలో భాగంగా పొద్దుతిరుగుడు సాగు జరుగుతోంది. ఈ రెండు మండలాల్లో 2,000 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతోంది. లాభదాయకంగా ఉండటంతో రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు. కోరుకొండ మండలం మునగాల, కోటి, గుమ్ములూరు, బుచ్చెంపేట, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో, సీతానగరం మండలం కూనవరంలో సాగు బాగా జరుగుతోంది. వేరుశెనగ, నువ్వుల నూనె కంటే ఈ పంట నూనె శ్రేష్ఠంగా ఉంటుంది. దీంతో వినియోగదారులు అధికసంఖ్యంలో వినియోగిస్తున్నారు.

కంపెనీలతో ఒప్పందం

పొద్దుతిరుగుడు పంట సాగులో ముందుగానే రైతన్నలు ఆయా ప్రైవేటు కంపెనీలతో గిట్టుబాటు ధరను నిర్ణయించుకుంటారు. మార్కెట్‌లో ధర తగ్గినా రైతులకు ముందుచేసుకున్న ఒప్పందం ధరనే కంపెనీలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు కేజీ ధర రూ.150 నుంచి 230 వరకూ ఉంది. ధర అనుకూలంగా ఉండటంతో రైతులు సాగుకు సానుకూలంగా ఉన్నారు.



మునగాలలో సాగవుతున్న పొద్దుతిరుగుడు పంట

ఎకరానికి 400 కేజీల దిగుబడి

నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ పంట సాగు జరుగుతోంది. మెట్ట ప్రాంతం సాగుకు నిలయంగా మారింది. ఎకరం విస్తీర్ణంలో సుమారుగా 400 కేజీల చొప్పున దిగుబడి జరుగుతోంది. కేజీ ధర రూ.230 ఉండటంతో ఎకరానికి రూ.70 వేలు ఆదాయం వస్తుంది. కాగా పెట్టుబడి కౌలుతో కలిసి రూ.50 వేలు ఉంటుంది. దీంతో రూ.20 వేలు మిగులుతుందని రైతులు చెబుతున్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతోంది.

సాగుకు అనుకూలం



మెట్ట ప్రాంతం పొద్దుతిరుగుడు సాగుకు అనుకూలంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పొద్దుతిరుగుడు నూనె శ్రేష్ఠత ఉండటంతో వినియోగం కూడా పెరిగింది. దిగుబడి పెరుగుతుండటంతో కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. విత్తనాల ఉత్పత్తికి నిలయంగా కోరుకొండ, సీతానగరం మండలాల్లోని గ్రామాలున్నాయి. ఇక్కడ రెండోపంటకు సాగునీరు పుష్కలంగా అందడం కూడా కారణంగా ఉంది. – టీకే మల్లికార్జునరావు, ఏడీ, వ్యవసాయశాఖ

లాభదాయకం



పొద్దుతిరుగుడు సీడ్ సాగు లాభదాయకంగా ఉండటంతో రైతన్నలు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ముందుగా రైతులతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ధర చెల్లిస్తాం. అలాగే విత్తనాల నుంచి సాగులో మెళకువలు ఎప్పటికప్పుడు తెలియజేయడం జరుగుతోంది. – అదపా వీరవెంకట సత్యశివ (బాబి), సీడ్ ఆర్గనైజర్, కోరుకొండ

రెండెకరాల్లో సాగు



గతంలో మొక్క జొన్న సాగు సాగుచేసేవాడిని. అది గిట్టుబాటు కాకపోవడంతో ఈ ఏడాది నుంచి పొద్దుతిరుగుడు సాగుకు మారాను. మునగాలలో 2 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్నాను. విత్తనాలు ఇచ్చిన కంపెనీ మావద్ద నూనె గింజలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. – కొల్లా ఏసుబాబు, రైతు, మునగాల

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నిర్మాణ కర్తలు

మధురపూడి: బూరుగుపూడి ఊర చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో క్షేత్రపాలకుడు పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ జరిగింది. ఆలయ నిర్మాణ కర్త అనంతాత్ముల బాలాజీ మాట్లాడుతూ ఇక్కడ 18 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అనంతాత్ముల ఉష, నాగ తేజస్వి, బుద్ధవరపు సూర్యనారాయణ మూర్తి, ఏవీఎస్ఎన్ మూర్తి, కంటే గణపతి, చొంగా వెంకన్న పాల్గొన్నారు

ఘనంగా సీతారామ కల్యాణం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద శుక్రవారం సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ కోటి స్థూపం 34వ వార్షికోత్సం సందర్భంగా ఈ కల్యాణం నిర్వహించారు. అర్చకులు రమణశర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పందలపాక గ్రామానికి చెందిన చిన్నం శేషారెడ్డి, విజయ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వెలగల వెంకటరెడ్డి, చిన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు



తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కోటికేశవరంలో వాటర్ ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండ మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభం

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కోరుకొండ హైస్కూల్లో రూ.2.05 కోట్లతో నిర్మించిన 12 అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే రాష్ట్రంలోని 44 వేల ప్రభుత్వ పాఠశాలలను రూ.25 వేల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. కోరుకొండలో 12 తరగతి గదులతో భవనాన్ని ప్రారంభించామని, మరో రూ.2 కోట్లతో ఇంకో భవన నిర్మాణం జరుగుతోందన్నారు. భవనాన్ని సకాలంలో పూర్తి చేసిన ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ చౌదరికి ఆయన అభినందనలు తెలిపారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహానికి ఆయన నమస్కరించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్, సినీనటుడు రాజబాబు విగ్రహాలకు, స్థలదాత అత్తిలి సత్యనారాయణ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పలు గ్రామాల్లో..

ముందుగా గాడాల గ్రామంలో రూ 21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.17.05 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. కోరుకొండ ఎస్సీ పేటలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్, దానికి సంబంధించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. పశ్చిమగానుగూడెంలో రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే, రూ.17.05 లక్షలతో నిర్మించిన హెల్త్‌సెంటర్, జలజీవన్ మిషన్ పేరిట రూ.72 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. కోటి కేశవరంలో రూ.58.05 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకును, పైప్‌లైన్‌ను, కోటి గ్రామంలో రూ.58.05 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. ఇదే గ్రామానికి చెందిన నందూరి సత్యనారాయణ ఇటీవల మరణించారు. రైతు బీమా పథకం ద్వారా విడుదలైన రూ.7 లక్షలు చెక్కును ఆయన సతీమణి భవానికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, కోరుకొండ ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసియ్య, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్, తహసీల్దార్ పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు క్రొవ్విడి సత్రాజు, కంటే వినయ్ తేజ, కొండపల్లి దుర్గారావు, కాంట్రాక్టర్ ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

గ్రాసిం ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయం

అనపర్తి: సామాజిక బాధ్యతగా సాయం అందిస్తున్న గ్రాసిం ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామ పరిధిలో గల గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో స్థానిక రెల్లిపేట, వెంకటరత్నాపురం ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రాసిం సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో వసతుల మెరుగుపరిచేందుకు సాయాన్ని అందిస్తోందని తెలిపారు. సంస్థ యూనిట్ హెడ్ కృష్ణన్, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్రిరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్‌బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తుమ్మా రాజేశ్వరి, బండారు శ్రీనివాస్, కొండేటి భీమేష్ పాల్గొన్నారు.

నాలుగు భవనాలకు భూమి పూజ

రంగంపేట: మండలంలోని ఈలకొలను, వడిశలేరు గ్రామాల్లో గ్రాసిం ఇండస్ట్రీస్ వారి సౌజన్యంతో నిర్మిస్తున్న నాలుగు కల్చరల్ యాక్టివిటీస్ భవనాల పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేల్, సర్పంచ్ శ్యామలావతి, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

డాల్ఫిన్ చేపకు పోస్టుమార్టం

కాలువ గట్టు పక్కన గొయ్యి తవ్వి పూడ్చివేత

పెదపూడి: ఏపీత్రయం శివారు బిక్కవోలు డ్రెయిన్‌లో గురువారం మధ్యాహ్నం చిక్కిన డాల్ఫిన్ చేపకు శుక్రవారం ఉదయం పోస్టుమార్టం చేసి, కాలువ గట్టు పక్కన గొయ్యి తవ్వి దానిలో పూడ్చివేశారు. తహసీల్దార్ టి.సుభాష్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఐవీకే రాజు తెలిపిన వివరాల ప్రకారం పశు సంవర్ధశాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో డాల్ఫిన్ చేపకు పోస్టుమార్టం చేశారు. పశు వైద్యులు రాజమహేంద్రవరానికి చెందిన ఫణీంద్ర, పెదపూడికి చెందిన కిరణ్మయి, భూపాలపట్నంనకు చెందిన భరత్ పోస్టుమార్టం చేశారు. అయితే డాల్ఫిన్ ఉప్పు నీటిలో జీవిస్తుందని, బిక్కవోలు డ్రెయిన్‌లో కొద్దిపాటి తియ్యటినీరు, బురద తగలడంతో జీవించలేకపోయిందని వైద్యులు తెలిపారన్నారు. వీఆర్వో జి.అంచిబాబు, ఫారెస్ట్ అధికారులు సిద్ధార్థ, ఉపేంద్రరెడ్డి, వసంతకుమారి, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ నూకరాజు పాల్గొన్నారు.



ఏపీత్రయం ఏటిగట్టుపై డాల్ఫిన్ చేపను గొయ్యి తీసి పూడ్చివేస్తున్న సిబ్బంది

రాష్ట్రంలో సీఎం జగన్ సుపరిపాలన

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మల్లంపూడిలో గడపగడపకూ



మల్లంపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో సీఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లంపూడిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. నవరత్నాల పథకాలతో అన్ని తరగతుల వారికి మేలు జరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాదాపు పూర్తి చేసిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు.

రూ.2.74 కోట్లతో అభివృద్ధి పనులు

మల్లంపూడిలో గడిచిన మూడున్నరేళ్లలో రూ.2.74 కోట్లతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే రాజా తెలిపారు. ఈ గ్రామంలో 4,117 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఏటా రూ.6,30,73,489 మేరకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించే సీసీ డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిరిశెట్టి చక్రధర్, ఉప సర్పంచ్ పెంకి దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు అనదాన సాయిరామ్, వేమగిరి కృష్ణ, సంగుల శ్రీరామకృష్ణ, పడాల బాబు, సంగుల బూరయ్య, పేపకాయల శ్రీను పాల్గొన్నారు.

ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు తోడ్పడతాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రుడా ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు అవసరమైన 28 నమూనా ప్రశ్నపత్రాలను వీటిద్వారా మీకు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో సేవలు

బిక్కవోలు: స్థానిక సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద అనపర్తికి చెందిన రమాదేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. శుక్రవారం ఈ సందర్భంగా డాక్టర్ జి.కృష్ణారావు 170 రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారికి మందులను అందించారు.

దోమల మందు పిచికారీ

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్ బాబు ఆధ్వర్యంలో దోమల లార్వా నిర్మూలన మందును పిచికారీ చేశారు. నగేష్ బాబు మాట్లాడుతూ దోమలను లార్వా దశలో నిర్మూలించాలన్నారు.

స్కూటీ మాయం

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన తిరుపతి ధన్వంతరి సూరి రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. గురువారం చినకొండేపూడికి వచ్చిన ఆయన తన ఇంటి వద్ద స్కూటీని పార్కింగ్ చేశారు. తెల్లవారేసరికీ అది మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గడప గడపకూ

బిక్కవోలు: పందలపాకలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొంటారన్నారు.

వేధిస్తున్న భర్తపై కేసు

బిక్కవోలు: అనుమానంతో వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బుజ్జిబాబు శుక్రవారం తెలిపారు. రంగాపురానికి చెందిన కేతా లక్ష్మికి అదే గ్రామానికి చెందిన శ్రీనుతో పదేళ్ల క్రితం వివాహం అయింది. ఈ నెల ఒకటిన భార్యాభర్తలు మామిడాడ తీర్థానికి వెళ్లి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఆగిపోయింది. దానిని నడిపించుకొని వస్తుండగా వెనుక నుంచి ఎవరో ఈల వేశారు. దాంతో భార్యపై అనుమానం పెంచుకున్న శ్రీను రెండవ తేదీ భార్యను తలపై కొట్టగా తీవ్రంగా గాయపడింది. ఆమెను బంధువులు 108లో అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం తరఫున తమకు అందుతున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే పింఛన్లు ప్రతి నెలా సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా సచివాలయంలో సంప్రదించాలన్నారు. స్థానిక అంబేడ్కర్ వీధిలో రూ.4.80 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకును సర్పంచ్ కొమరం శ్రావణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వెలమపేటలో రూ.2 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో 2.60 లక్షల సామర్థ్యం గల రెండు మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే చంటిబాబును ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



గోకవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

సంపద తయారీ కేంద్రంపై సంతృప్తి

పెదపూడి: గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం చేకూర్చే చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను అందరూ వినియోగంలోకి తీసుకురావాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. ఆయన రామేశ్వరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని మెటీరియల్ రికవరీ యూనిట్‌గా ఎంపిక చేశారన్నారు. దీంతో మండలంలోని గ్రామాల్లో గల గాజు, ప్లాస్టిక్ మొదలగు వాటిని నలిపి బూడిద చేస్తారన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు బాగానే తయారు చేస్తున్నారని, దీనిని రైతులకు నిబంధనల ప్రకారం విక్రయించాలన్నారు. రైతులు సేంద్రియ సాగు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం సచివాలయంలో అధికారులు, వలంటీర్లకు సంక్షేమ పథకాలపై సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సర్పంచ్ కొటికలపూడి చినబాబు, సత్యరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిలిచిన ఇసుక తవ్వకాలు

సీతానగరం: మండలంలోని మునికూడలి ఇసుక ర్యాంపులో తవ్వకాలు శుక్రవారం నిలిచిపోయాయి. వేరే వ్యక్తులు తమకు అనుమతులు ఉన్నాయంటూ మునికూడలి ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలు జరుపుతుండగా జేపీ గ్రూప్ అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదు చేసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్‌పి పి.సోమశేఖర్, ఎస్ఈబీ సీఐ జి.సత్యనారాయణ, కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, గోకవరం ఎస్సై నాగశివబాబు, హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ ఇసుక తవ్వకాలు జరిపే ప్రాంతం ప్రక్కిలంక రెవెన్యూకి చెందుతుందని నిర్ధారించారు.

కుష్ఠువ్యాధిపై ఇంటింటా సర్వే

రాజానగరం: కుష్ఠువ్యాధి రహితంగా జిల్లాను తీర్చిదిద్దడంలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనిడెక్ట్ తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి జనవరి 30 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఈ నెల 13 వరకు జరుగుతాయన్నారు. శ్రీకృష్ణపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల, రాధేయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ, రీచ్‌మీ ప్రాజెక్టులు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. హెచ్ఎం టీవీఎస్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ వుల్లారావు పాల్గొన్నారు.